క్లుప్తంగా

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పాశర్లపూడిలోని పొల్లమ్మ ఆలయం సమీపాన మంగళవారం వీరభద్ర స్వామి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఉదయం స్వామిని మేలు కొలిపారు. అనంతరం భక్తులు వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. గోదావరి నదీస్నానంతో పాటు పలు పూజలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం శమీ పూజతో పాటు భజన ఘనంగా నిర్వహించారు. స్వామి వారి భక్తులు 60 గజాల పొడవు కలిగిన నిప్పులగుండం తొక్కారు. కొత్తలంక పుల్లయ్య అవధానులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



గొల్లపాలెంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఓఎన్జీసీ సాయంతో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 181 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 90 మంది రోగులను కళ్ల జోళ్లకు ఎంపిక చేశారు. 15 మంది రోగులకు ఉచిత కాటరాక్ట్ ఆపరేషన్లకై వైద్యులు సిఫారసు చేశారు. ఓఎన్జీసీ అధికారి బాపూజి నాయక్, పెరికార్, ఎంకే దాసు, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన నగరం విద్యార్థులు

మామిడికుదురు: ఈ నెల 18న నందిగామలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో నగరం విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం గుబ్బల మౌనిక మంగళవారం తెలిపారు. కొంబత్తుల రోషన్, ఆకుమర్తి అవినాష్, మడిమెట్ల అభిషేక్, ఉండ్రాజవరపు పూజశ్రీ, జక్కంపూడి నాగశ్రీకర్, బిక్కిన రేష్మమన్విత, చింతా కల్యాణి, శీలం కార్తీక్ వెంకటసాహి, తాడి వర్ధనబాబు జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ మట్టా శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో డీవీవీ సత్యనారాయణ, జక్కంపూడి శివప్రసాద్, పీడీ బొమ్మిడి ధర్మ పాల్గొన్నారు.

పీచు బొమ్మల కొనుగోలుకు ప్రతిపాదనలు



పాశర్లపూడిలో కొబ్బరి పీచు బొమ్మలను పరిశీలిస్తున్న నాబార్డు మేనేజర్ వీరబాబు

మామిడికుదురు: కోనసీమలో మహిళలు కొబ్బరిపీచుతో తయారు చేస్తున్న బొమ్మలను కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేపాక్షి విక్రయ కేంద్రాల ద్వారా అమ్మేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కాకినాడ లేపాక్షి మేనేజర్ వీరబాబు తెలిపారు. ఆయన మంగళవారం పాశర్లపూడిలోని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో నిర్వహిస్తున్న గ్రామ దుకాన్ కొబ్బరి పీచు బొమ్మల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమలో మహిళలు తయారు చేస్తున్న కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది మహిళలకు ఉపాధి పెరుగుతుందన్నారు. తద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన పెరుగుతుందన్నారు.

ఎంపీడీఓగా వరలక్ష్మి



అంబాజీపేట: మండల ప్రజా పరిషత్ ఇన్‌చార్జి అభివృద్ధి అధికారిణిగా కె.వరలక్ష్మి ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉత్తర్వులు వచ్చాయని వరలక్ష్మి తెలిపారు. మండలంలోని అధికారులందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. వలంటీర్లు ఎవరూ ఎన్నికల ప్రచారాల్లోను, పార్టీ సమావేశాల్లో పాల్గొనవద్దన్నారు.

ప్రజా ఆశీర్వాదంతో విజయం ఖాయం

- అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక
- ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- భారీగా తరలి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



చింతలమోరిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన రాపాక వరప్రసాదరావు



అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు హారతి ఇస్తున్న ఆయన సతీమణి నాగరత్నం

రాజోలు/మలికిపురం: ప్రజా ఆశీర్వాదంతో అమలాపురం పార్లమెంట్ స్థానంలో విజయం ఖాయమని అమలాపురం పార్లమెంటరీ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం చింతలమోరిలోని ఆయన స్వగృహం వద్ద ఎన్నికల ప్రచారాన్ని మధ్యాహ్నం 1.04 గంటల సుముహూర్తంలో రాపాక సతీమణి నాగరత్నం హారతి ఇవ్వగా పార్టీ సీనియర్ నాయకులు చంటిరాజు ఆశీర్వాదం తీసుకుని బయలుదేరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై రెట్టించిన ఉత్సాహంతో అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక విజయం ఖాయమంటూ జై జగన్.. జై రాపాక నినాదాలు చేశారు. ఇంటి నుంచి ఊరేగింపుగా స్థానిక సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందుకు దర్శించుకునే స్థానిక రామాలయంలో పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. రాపాక మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంకల్పబలంతో అమలాపురం పార్లమెంట్‌లో విజయం సాధించి తీరతానన్నారు. రాజోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న తనను అమలాపురం పార్లమెంట్‌కు ప్రమోషన్‌పై పంపించారన్నారు. రాజోలు అసెంబ్లీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును నియమించిందని ఆయన విజయానికి కృషి చేస్తానన్నారు. పి.గన్నవరం, కొత్తపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని అభ్యర్థులను కలసి వారితో పాటు ప్రచారంలో పాల్గొంటానన్నారు. జెడ్పీటీసీలు బళ్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణ, ఇంజేటి వసంత, పార్టీ ముఖ్య నాయకులు కెఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, మండల పార్టీ అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, అడబాల వీర బ్రహ్మజీ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య పాల్గొన్నారు.

యోగాసనాలపై శిక్షణ ఇవ్వాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు సులభమైన యోగాసనాలపై శిక్షణను ఇవ్వాలని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి.శారద అన్నారు. మండలంలోని పినపళ్ల, పెదపళ్ల, సంధిపూడి గ్రామాల్లో పర్యటించి పౌష్టికాహార వారోత్సవాలు అమలు తీరుతెన్నులను మంగళవారం ఆమె పరిశీలించారు. సమావేశంలో యోగాసనాలు వల్ల కలిగే ఆరోగ్యకరమైన ఉపయోగాలను వివరించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని నిర్ణీత సమయంలో లబ్ధిదారులకు అందించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. అనంతరం పౌష్టికాహార వారోత్సవాల ఆవశ్యకతను స్థానికులకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, వై.అరుంధతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి



మండల పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి

రాజోలు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజోలు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం రాజోలులో పార్టీ నాయకుడు దార్ల పెదబాబు ఇంటి వద్ద మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచనల మేరకు రాజోలు నియోజకవర్గంలో పార్టీని విజయపథంలో నిలపాలన్నారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన తాను ఇరువురు పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రాపాక భారత పార్లమెంట్‌లో ఉన్నతస్థాయిలో ఈ ప్రాంతవాసులంతా చూడాలన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, రాష్ట్ర ఐటీ విభాగ కార్యదర్శి సూరిశెట్టి బాబి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి బండారు కాశీ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణి, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంటీటీసీ కొపనాతి పుష్పలత, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కేడర్‌తో గొల్లపల్లి

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో మంగళవారం వైఎస్సార్ సీపీ కేడర్‌ను రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మర్యాద పూర్వకంగా కలిశారు. జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీటీసీ గుబ్బల గౌరీ వెంకట పద్మావతిలను కలిశారు. వెంట మంగెన సింహాద్రి, గెద్దాడ సత్యనారాయణ, బండారు కాశీ, కూనపరెడ్డి రాంబాబు, బుచ్చయ్య మాష్టారు పాల్గొన్నారు.

ఓటే బలమైన ఆయుధం



తాటిపాక సెంటర్‌లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న జేసీ నుపూర్ అజయ్

రాజోలు: ఓటే బలమైన ఆయుధమని జిల్లా జాయింట్ కలెక్టర్, రాజోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీవాస్ నూపుర్ అజయ్ అన్నారు. మంగళవారం తాటిపాక సెంటర్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎస్‌వీఈఈపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అలాగే 85 ఏళ్ల వయస్సు దాటిన వారు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేసి ప్రభుత్వాలను ఎన్నుకోవాలన్నారు. తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



గుడిమెళ్లంకలో మునేశ్వరరావు తదితరులకు పార్టీ కండువాలు వేస్తున్న గొల్లపల్లి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో మంగళవారం టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ వాణిజ్య విభాగం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కేసరి మునేశ్వరరావు తన అనుచరులతో కలసి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పార్టీ కండువాలను వేసి, సాదరంగా ఆహ్వానించారు. స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



మామిడికుదురు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

మామిడికుదురు: మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. స్కూల్ వద్ద పరిస్థితిని నగరం ఎస్సై పి.సురేష్‌తో కలసి సమీక్షించారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోసం చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలో జరుగుతున్న పది పరీక్ష కేంద్రాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి బి.హనుమంతరావు, స్థానిక తహసీల్దార్ జె.విమలకుమారి మంగళవారం తనిఖీ చేశారు. పుల్లేటికుర్రు, అంబాజీపేట పరీక్ష కేంద్రాలను పరిశీలించి అబ్జర్వర్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని హనుమంతరావు తెలిపారు. జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. కాపీయింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వలంటీర్ల సస్పెండ్

అంబాజీపేట: ఎన్నికల నిబంధనలను అతిక్రమించారనే ఆరోపణలపై మండలంలోని మూడు గ్రామాలకు చెందిన 16 మందిని సస్పెండ్ చేసినట్టు ఎంపీడీఓ కె.వరలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ మేరకు సస్పెండ్ ఉత్తర్వులను అందజేసినట్టు ఎంపీడీఓ తెలిపారు.

వాహనాల తనిఖీ

అంబాజీపేట: ఎన్నికల నేపథ్యంలో ముక్కామల ప్రధాన రహదారిపై వెళుతున్న వాహనాలను ఫ్లెయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి జీజీవీకే కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది సహకారంతో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా మద్యం తరలించినా, ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో పోలీస్ కానిస్టేబుల్ శ్రీధర్ ఉన్నారు.

వేగవంతంగా పోలింగ్ బూత్ నిర్మాణ పనులు

అంబాజీపేట: మాచవరంలో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ బూత్‌ను నాడు నేడు పథకంలో భాగంగా పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. పోలింగ్ బూత్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. పోలింగ్ బూత్ వద్ద టాయిలెట్స్, విద్యుత్, ఇనుప గ్రిల్, టైల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వికలాంగులు వచ్చేందుకు ర్యాంపులను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసిన రాపాక



అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తిని కలసిన ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు

రావులపాలెం: ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని అమలాపురం వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి రాపాక వరప్రసాద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రావులపాలెం సీఆర్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు శాలువాలు కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. రాపాక మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపేట ఎంపీపీ మార్గాని గంగాధరరావు, ఆలమూరు మండల పార్టీ కన్వీనర్ తమన శ్రీను తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన ఎంపీ అభ్యర్థి

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును అమలాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాపాకను విప్పర్తి దుశ్శాలువాతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కలసి పని చేస్తామని విప్పర్తి, రాపాక అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సింహ, ముత్యాల పందిరి వాహనోత్సవాలు



రావులపాలెంలో సింహ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

రావులపాలెం: స్థానిక అలవేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామికి సరస్వతి హోమం తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతం స్వామిని సింహ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి ముత్యాల పందిరి వాహనోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి తదితర సభ్యులు పర్యవేక్షించారు.

వివిధ పనులకు టెండర్లు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో మంగళవారం దేవస్థానానికి చెందిన వివిధ పనుల లైసెన్సుల హక్కుల నిమిత్తం అధికారులు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. కొన్నింటిని ఒక సంవత్సరం కాలపరిమితికి ఖరారు చేసినట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఇందులో ప్రధానంగా కిరాణా, పూజాద్రవ్యాలు, డిస్పోజబుల్ సరఫరా చేసే నిమిత్తం, గోవులకు దాణా సరఫరా చేసే నిమిత్తం, లామినేషన్ ఫొటోలు, పువ్వులు, పూల దండలు సప్లయ్ చేసే నిమిత్తం టెండర్లు ఖరారు అయినట్టు ఆయన చెప్పారు. కాగా మరికొన్ని టెండర్లు టెండర్‌దారులు ఎవరూ రానందున వాయిదా వేసినట్టు ఏసీ అన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

మామిడికుదురు: మామిడికుదురు అంజు కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం అంజు ఐ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం ఏర్పాటు చేశామని మేనేజర్ పల్లి స్వామి మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో అంతర్జాతీయ గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ ఆండ్రూ మెర్‌మండ్, రెటీనా శస్త్ర చికిత్స నిపుణులు తేజ ఉచితంగా వైద్య సేవలందిస్తారని చెప్పారు. అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ ఫౌండేషన్ కాకినాడ, విజన్ ఫర్ ఆల్ స్విట్జర్లాండ్ నిపుణుల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. నిరుపేదలకు ఉచితంగా కంటిలో అద్దం వేసే పద్ధతిలో కంటి శుక్లాలు కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం పొందే వారు ఆధార్‌కార్డు తీసుకు వచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని స్వామి సూచించారు.

ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేయాలి



ఆలమూరులో ఎన్నికల నియమావళిపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అధికారులందరూ ప్రవర్తన నియమావళిని సక్రమంగా అమలు చేయాలని, ఆరోపణలకు అస్కారం ఇవ్వొద్దని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిగింది. ప్రతి గ్రామంలోనూ ఫ్లెక్సీలు ఉండకుండా తొలగించాలన్నారు. అలాగే గ్రామంలో రాజకీయ పార్టీల మధ్య ఏ విధమైన ఘర్షణలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే సత్వరమే మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ వి.రామ్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

అంబాజీపేట: ఎన్నికల నియమావళిలో భాగంగా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పి.గన్నవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఈసీ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. పంచాయతీ, సచివాలయాల సిబ్బంది కోడ్ అమలుపై దృష్టి సారించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌కు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. అనంతరం కీలక ఆదేశాలను అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సక్రమంగా మందులు అందించాలి

ఆలమూరు: కుష్ఠు వ్యాధిగ్రస్తుల ఇంటికి వెళ్లి సక్రమంగా సరైన సమయానికి మందులు అందించాలని డీపీఎంఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లో పర్యటించి కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అందుతున్న చికిత్స విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యాధిగ్రస్తుల వద్దకు వెళ్లి వ్యాధి తీవ్రతపై ఆందోళన చెందవద్దన్నారు. కుష్ఠు వ్యాధి నివారణకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినందున నిర్ణీత సమయంలో వ్యాధి తగ్గుముఖం పడుతుందని వ్యాధిగ్రస్తుల్లో భరోసా కల్పించారు. కుష్ఠు వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిశోర్ పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో వేంచేసిన తూర్పు వీధి రామాలయం వద్ద బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరగనుంది. దాతల సహకారంతో నిర్మించిన ఈ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహానికి గ్రామోత్సవం జరిగింది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం కార్యక్రమంలో పాల్గొన్న బాపిరాజు, జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. లొల్ల లాకుల వద్ద నదీ తీరంలో చక్రతీర్థ స్నానం దీక్షావిసర్జన తదితర పూజలను వేదపండితులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. మూడు రోజులు స్వామివారి పూజల్లో పాల్గొన్న టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు-అన్నపూర్ణ దంపతులను ఆలయ నిర్మాణ దాతలు పాతపాటి నాగరాజు, రామాంజనేయరాజు, రమణరాజు దంపతులు ఆయన స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వేలాది మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అయినవిల్లి: రోడ్డు ప్రమాదంలో అయినవిల్లి సర్పంచ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీను ముక్తేశ్వరం-అయినవిల్లి బైపాస్ రోడ్డులో అయినవిల్లి పెదపేటలోని తన బైక్‌పై వస్తున్నారు. అదే రోడ్డులో తన వెనుక వస్తున్న మరో బైకిస్టు బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు గాయాలయ్యాయి. అలాగే అతడితో పాటు మరో బైకిస్టు, అతని భార్యకు గాయాలయ్యాయి. గాయాలైన వీరిని అమలాపురంలో ఆస్పత్రికి తరలించారు.

అమ్మవారి ప్రభ ఊరేగింపు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ప్రభ ఊరేగింపు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి అమ్మవారి తీర్థ మహోత్సవాలు మొదలయ్యాయి. ఉదయం ఆలయం వద్ద నుంచి మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో వైభవంగా పురవీధుల్లో అమ్మవారి ప్రభ ఊరేగింపు గ్రామ పురవీధుల్లో సాగింది. దారి పొడవునా ఆసాదులు చేసిన గరగ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి ఆలయంలో కన్నుల పండువగా గోకర్ణేశ్వర స్వామి, జలదుర్గ అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. మెండు ఉదయభాస్కరరావు దంపతులతో పూజారులు ఈ కల్యాణం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.